# డోంట్ వర్రీ డార్లింగ్

రచన :
'రాధేయ'

నిండు పున్నమి.

పాటిలేని సౌందర్యంతో మెరిసిపోతున్నాడు కలువ ప్రియుడు తన వెలుగుకిరణాలతో. తొలిసారిగా ప్రియుని కౌగిలి చేరబోయే నవవధువులా సిగ్గులొలికిస్తూ, కమ్మటి కలలు పండించుకోవాలని వికసించినయి కలువలు. నెలరేడు నీలిమేఘాలతో దోబూచులాడుకొంటున్నాడు. తారలు నీలి మబ్బుల్లో దాక్కుంటూ తన ప్రియునివైపుచూపి కొంటెగా నవ్విస్తున్నాయి. విరిసినసౌందర్యాన్ని గాంచిన భ్రమరం 'ఝుం' అంటూ పుష్పాలపై వాలింది.

తన కళ్ళెదుట మనోహరదృశ్యాన్ని పదేపదే చూస్తూ పరవశించిపోతున్నది సంధ్య.

సంధ్యా! తన భుజాలపై కరస్పర్శ తగులగానే ఉలిక్కిపడింది! ఊహాలోకంలో విహరిస్తున్న మనసును కళ్లెం పట్టి ఆపింది.

ఓ, మీరా! మీకోసమే చూస్తున్నా. పదండి, భోంచేద్దాం! అంటూ లేవబోయింది.

నాకిప్పుడు ఆకలిగాలేదు. కూర్చో అంటూ చెయ్యిపట్టి లాగాడు రవి.

ఆ ఊపుతో అతని ఒడిలోకి వాలిపోయింది.

సంధ్యా! అన్నాడు ఆత్రంగా కళ్ళలోకిచూస్తూ. కానీ మరుక్షణమే ఆముఖం విషాదగీతాలుపలికే వీణను గాంచిన సంగీతప్రియుడు పొందే ఆవేదనలా మారిపోయింది. వేడై పోయివుంది శరీరం.

రవీ, నిజం చెప్పు. నీకు ఆకలి వెయ్యటంలేదా? ఏది ఒక్కసారి నాకళ్ళలోకిచూసి చెప్పు, అంది. వడలిపోయిన రవిముఖాన్ని చేతులతో రాస్తూ.

నిజం సంధ్యా! అన్నాడు సంధ్యకళ్ళలోకి సూటిగా చూడలేక.

నాకు తెల్పు రవీ! ఆమాత్రం అర్థం చేసుకోలేనిదాన్ని కాదు. చూడు రవీ. నేను మీకు కాబోయే అర్థాంగిని. మీ అనురాగంతోపాటు మీ కష్టాలనుకూడా పంచుకోవలసిన దాన్ని, నన్నిలా బాధపెడుతూ వేరుగా చూస్తారా, చెప్పండి. ఉబుకుతూ వచ్చేకన్నీటిని ఆపుకోలేక రవి గుండెపై తల వాల్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

వద్దు, సంధ్యా! ప్లీజ్! నీవలా మాట్లాడకు, నేను భరించలేను. నన్ను నమ్ము అంటూ, ఆత్రంగా హృదయానికి హత్తుకొని ఓదార్చుతూ, నిజం చెబుతున్నాను. ఉద్యోగం కోసమై నేనీరోజు తిరగని వీధిలేదు. అర్థించని ఆఫీసరూ లేదు. కనీసం చిన్న నౌకరీ అయినా సంపాదించుకొని నిన్ను పోషించుకోవాలన్నదే నా ఆశయంకూడా. మరి నీవు లక్షాధికారిబిడ్డగా పుట్టకపోయినా తినడానికి ఏ లోటులేని ఇంట్లో గారాబంగా పెరిగావు. వారినివదలి చివరికి ఈ సామాన్యుని కోసం ఎందుకొచ్చావు సంధ్యా! తన కన్నీటిచుక్కలు టప, టపమంటూ ఆమె భుజాలపై పడగానే, ఉలిక్కిపడి!

అలా మాట్లాడకు రవీ! నీ ఆదరణ ఆప్యాయత లుంటే చాలు! నాకే ఆస్తులు అంతస్థులు అవసరం లేదు!

కేవలం ఆదరణ అంటే కడుపు నిండుతుందా! పిచ్చి దానా? నేను పుట్టగానే తలిదండ్రులు వెళ్ళిపోయారు. కష్టజాతకుడినని నన్నంతా ఆడిపోసుకున్నారు. ఊహ తెలిసినప్పటినుండి చాలాఇళ్ళు మారుతూ అందరిచీవాట్లు భరిస్తూ ఏదో స్కూలుఫైనలు పాసైనాననిపించుకొని బయట పడ్డాను,

వారెంత చీదరించుకొన్నా వారందరి సహాయసహకారాలతోనే నేనింతవరకూ వచ్చాను. అందుకే వారికెప్పుడూ ఋణపడివుంటాను.

అతని కళ్ళలోకి ఆర్ద్రతగాచూస్తూ చెప్పేదంతా శ్రద్ధగా వింటోంది సంధ్య.

నౌకరీకోసం మీఊరుకొచ్చి మీ నాన్నను బ్రతిమాలుకొని చిన్న క్లార్కుఉద్యోగం సంపాదించుకొన్నాను. వీరి పరిచయమేర్పడి మీ అంతస్థులకూ నాజీవితానికీ పెద్ద అగాధ మేర్పడింది. కన్నవారినే త్యజించి నాతో అంటి వచ్చావు. ఉన్నఉద్యోగం వారు ఊడదీశారు! కానీ సంధ్యా, నువ్వే నాకు అండనీడగా ఉండాలేగాని ఎలాంటికష్టాలనైనా భరించేందుకు సిద్ధమే, నన్ను నమ్ముమా!

చాలండీ! నేనెంతో అదృష్టవంతురాలు! మరింత గాఢంగా హృదయానికి అంటుకొనిపోయింది తన వెచ్చట కన్నీటితో. రవి బట్ట అంతా తడిసింది. పదండి. నాకోసమైనా కొంచెం ఎంగిలిపడాలి మీరు! రానున్న రేపటికోసం నేటినుండే దిగాలుపడి కూర్చుంటే మనజీవితాలు ముందుకు

సాగుతాయా! ఇంకొక ముఖ్యవిషయం రేపే మనం రిజి, ష్ట్రార్ ఆఫసులో పెళ్ళి చేసుకొందాం? అన్నది,

అలాగే సంధ్యా: ఉన్నవగలన్నీ అమ్మి పూట గడుపు కొంటున్నాం. నీఅందాన్ని నాచేతులారా పాడుచేస్తున్నాను. ఇలాంటి హితుడు ఎవడుంటాడు చెప్పు! వడ్డించిన విస్తరి ముందు తనప్రక్కనే కూర్చున్న సంధ్య కోపిమెడను చూస్తూ.

చూడండి! ప్రతి చిన్నవిషయానికి మీరిలా బాధపడితే ఎలా చెప్పంటి? స్త్రీకి సహజమైన అందముంటే చాలుగానీ కృత్రిమమైన ఆభరణాలు అందాన్నిస్తాయా! ఎందుకు మీరింత నిరుత్సాహపడతారు. మీకు ఉద్యోగం రావాలేగానీ అలాంటివి ఎన్నైనా చేయించుకోవచ్చు. ముద్దలు కలిపి చేతిలోపెడుతూ అంది!

ఏమిటో, నాలాంటివాడిని కట్టుకొని నువ్వేం సుఖపడతావో అంటూ నిట్టూర్చాడు.

చూడండీ, మీరు మరోలా భావించకపోతే నేను టైపు హైయ్యరు పాసయ్యాను. ఈరోజునుండి నేను జాబ్‌కై ట్రై చేస్తాను. వేడ్నీళ్ళకు చన్నీళ్ళు తోడైనట్లు మన జీవితాలు గడిచిపోతాయి.

వద్దు సంధ్యా, వద్దు! నువ్వు కష్టపడుతుంటే నేను చూడలేను. ఏదైనా ఉద్యోగం రాకున్నా ఏదైనా కూలిగమైనా సంపాదించుకొని నిన్ను నేను పోషించుకోగలను. పనిచేసి అలసిపోయి ఇంటికివచ్చిన నన్ను సేదదీర్చి, తీపి కబుర్లు చెపుతూంటే నేనెంత సంతోషిస్తానో తెలుసా? నీవూ నాలాగే తయారై అలసిపోయి ఇంటికొచ్చి మళ్ళి ఇంటిపనులు చేసుకోవాలంటే ఎంత కష్టమో తెలుసా! నామాటవిని ఆ ఆలోచన మానుకో సంధ్యా!

అతనిమనసుకు కష్టం కలిగించడం ఇష్టంలేని సంధ్య అలాగేనంటూ తల ఊపింది.

భోంచేసిన వెంటనే మానసికంగా అలసిపోయిన ఆ హృదయాలను తన ఒడిలోకి తీసుకొని లాలించింది నిద్రాదేపి!

* * *

మానవజీవితం ఎంత విచిత్రమైనది! అందులో భయంకరమైనది యవ్వనం! ఈ వయసులో కోర్కెలు ఎగిరే విహంగులకై పట్టుచిక్కక పయనిస్తాయి, ఈవయసులో ఏ కొంత కాలుజారినా జీవితం పూర్తిగా మలుపు తిరిగి



పోతుంది. పరుగులెత్తే కోర్కెలకు కళ్ళెం వేయగలసహన ముంటే ప్రతిమనిషి ప్రగతిపధాన పయనిస్తూ తాను అనుకున్న గమ్యం చేరుకొంటాడు.

చక్రవర్తి వస్తున్నాడన్నవార్త వినగానే వైదొలగి నిలుచున్న సేనాసమూహంలా, సూర్యుడుదయిస్తున్నాడన టానికి నిదర్శనంగా మబ్బులన్నీ జారుకొనగానే ప్రకృతి స్వాగతం పలికింది. ఉత్తరాద్రిగ ఉదయిస్తున్న సూర్యుడు ఎర్రందు చీరెపై చమ్కీపూల డిజైను అమరించినట్లుగా వెలుగుకిరణాలు ప్రకృతిపై ప్రసరింపబడగానే ఫలపుష్పాదులతో నిండిన మొక్కలు వయోభారం మోయలేని నిండు గర్భిణిలా తూలుతున్నాయి. రంగురంగులపక్షులు తమ గూళ్ళనువదిలి బయటికివచ్చి ఆహారనిమిత్తమై ఆయత్త పడుతున్నాయి. ప్రకృతి సౌందర్యానికి స్వాగతంపల్కుతూ అల్లనల్లనవీచే విషతిమ్మెరలు వేణుగానతరంగిణులు వెదజల్లుతున్నాయి.

పగలంతా బాగా అలసిపోయివున్నందున రాత్రంతా గాఢనిద్రలో మునిగిపోయారా దంపతులు. ప్రొద్దుపొడిచి సూర్యకిరణాలు కిటికీగుండా ప్రవేశించి, వాడిగా గ్రుచ్చుకొనగానే కళ్ళు నులుముకొని లేచింది సంధ్య. ప్రక్కనే రవికోసం చూచింది। ఆశ్చర్యం। రవి లేదు. ప్రక్క ఖాళీగా వుంది.

ఆదుర్దాగా ఇళ్ళంతా కలియచూసింది. ఎక్కడా ఆచూకీ లేదు.

తనకు కళ్ళుతిరిగి శరీరం వశం తప్పినట్లయింది।

ఏమిటి? రవి ఎందుకు వెళ్ళిపోయాడు? ఎందుకు తనతో చెప్పకుండా అంతర్ధానమయ్యాడు అంటూ అంతరాత్మ నిలదీసి తన్ను ప్రశ్నిస్తూంటే జవాబు తెలియక అవస్థపడే రెండవతరగతి పిల్లవాడిలా వుంది తనస్థితి.

అతనిదుస్తులుకూడా లేవు. తన సూట్‌కేసుమాత్రమే వుంది।

దిండుకేసి తల బాదుకొంటూ విలిపించింది. కానీ దిండు క్రిందనే ఓ చీటి కన్పించింది.

ఆత్రంగా చేతుల్లోనికి తీసుకొంది.

సంధ్యా—

నేను నిన్నుకాదని వెళ్ళటంలేదు. కానీ నీవు చిన్నప్పటి నుండి అంతస్థులలో పెరిగి ఐశ్వర్యంతో జీవితాన్ని అనుభవించి చివరకు కూటికిలేని నిరుపేదను వలచి నీ ఆనందమయజీవితాన్ని చెరుపుకొన్నావు. కానీ, నాజీవితంలో అన్నీ కష్టాలే రాసివుంటాడేమో ఆ దేవుడు, ఉద్యోగాన్వేషణలో నీ ఒంటిమీద నగలన్నీ హరించాను. కానీ, సంధ్యా! మనకు మానసికంగా పెళ్ళి ఏనాడో జరిగింది. కానీ, సంఘందృష్టిలో మన పెళ్ళి జరగవలసిన ఈ సమయంలో నేనెందుకు వెళ్ళిపోతున్నానో ఒక్కసారి ఆలోచించు।

ఒక నిరుద్యోగి భార్యలా నిన్ను వస్తులుంచలేను. అందుకే ఉద్యోగాన్ని అన్వేషిస్తూ వెళ్ళిపోతున్నాను. ఉద్యోగం దొరికినవెంటనే నిన్ను చేసుకొంటాను. సంఘంలో నేను ఒక వ్యక్తిత్వంగల మనిషిగా నిలబడి నిన్ను పెళ్ళి చేసుకొంటాను. ఇప్పుడే నీకు తాళికట్టి నలుగురిలో మీ ఇంటిగౌరవాన్ని మంటగలుపలేను. ఏదో ఒక చిన్న ఉద్యోగమైనా సంపాదించుకొని నిన్ను చేసుకొంటాను. అదే నాకు సంతృప్తి. అంతవరకూ నాకోసం మనం కలలుగన్న జీవితంకోసం సహనంతో నిరీక్షిస్తూ గడిపేది. నా అన్వేషణలో కొన్నిరోజులే పట్టవచ్చు. లేదా కొన్ని ఏండ్లయినా పట్టవచ్చు. కానీ నా అభ్యర్ధనమాత్రం ఒక్కటే. నువ్వు మీ తల్లిదండ్రులను చేరుకొని ఎప్పటిలాగే జీవించు.



కానీ నీమనసులో పరకిమనిషిగా నన్ను త్రోసెయ్యకు. నిన్ను సదా సాహృదయంలో పదిలంగా దాచుకొంటా.

త్వరలో కలుసుకొంటామన్న ఆశ వుంది.

నీ

'రవి'

రవీ; అంటూ కుప్ప కూలిపోయింది సంధ్య!

ఎంతపని చేశావు. నీమీదే ఆశలు పెంచుకుని కన్నవారిని కాదనివచ్చిన నన్ను యిలా వదిలివెళ్ళటం నీకెలా మనసొప్పింది రవీ! అంటూ వెక్కి వెక్కి ఏడ్చింది.

వద్దు; వెళ్ళకు. ఒకవేళ నీ తల్లిదండ్రులు అంగీకరించినా అందులో వారిస్వార్థం వుందన్నమాట మరచిపోకు. నీకు మళ్ళీపెళ్ళి ప్రయత్నాలుచేసి సంధికూర్చటానికి ప్రయత్నిస్తారు. ఏ ఆశయంతో ఇల్లు వదలివచ్చావో ఆ ఆశయాన్ని ఫణంగా పెట్టుకొని జీవించ పరిష్కరించినావు. నీ కోర్కెలు పెంచుకొన్న నీ ప్రియుడు ఎప్పటికైనా వస్తాడన్న ఆశతో అతన్ని నిరీక్షిస్తూండు. అదే పరిష్కారమార్గం. కాదని మళ్ళీ మీఇంటిగడపలో కాలుపెట్ట దలుచుకొంటే వెళ్ళు. కానీ ఈ జీవితానికి స్వస్తి చెప్పి, మరొకవ్యక్తితో జీవితం ప్రారంభించు, అంటూ హెచ్చరిస్తూన్న మనస్సును నివారించలేకపోయింది.

అవును. నిజమే. ఒకరికే మనసు అర్పించి ఏ ఆశయంతో నేను ఇల్లువదలివచ్చానో మళ్ళా ఏ ముఖంతో ఆ ఇంటికి వెళ్ళను? నా రవి లేకుండా నేను జీవించలేను. వచ్చేవరకూ నిరీక్షిస్తూనే జీవిస్తాను అంటూ దృఢంగా నిశ్చయించుకొంది సంధ్య.

తనవద్ద రెండువందల రూపాయలుమాత్రమే మిగిలి వుంది. రెండునెలలు ఇంటి అద్దె పొదిగింతుకొని ఏదో ఒక చిన్నపని చూసుకొనేవరకూ ఆ మిగిలినడబ్బు సరిపెట్టుకొనాలనుకొంది!

* * *

మనగడ ఆనేవీణ జీవనరాగం విషాదంగా పలుకుతూంటే వెన్నెల విరిసినా అమృతం కురిసినా ఎన్నిఅందాలు కవ్వించినా ఆరాగంలో ఆనందం ధ్వనించదు. ఏమిటో ఈ జీవితం. పూలబాట అనుకొని ముందుకుసాగితే రహదారి అంతా పల్లేరుకాయలతో నిండివుంది,

పగలంతా పనికోసం పేరుమోసిన ఆఫీసుల్లో పెద్దలందర్నీ అర్థిస్తూ వారుకాదంటే విసుగుచెందకుండా అంతా తిరిగి విసిగి వేసారిపోయిన సంధ్యకు నీరసం ఎక్కువైంది.

త్వరగా ఇంటికివెళ్ళి విశ్రాంతి తీసుకోవాలనిపించింది తనకు!

గబగబా ఇంటివైపుకు నడిచింది.

గది గుమ్మంలోనికి అడుగుపెట్టిన సంధ్య ఆశ్చర్యపోయింది;

గదితలుపులు తెరువబడివున్నాయి. దొంగలెవరూ ప్రవేశించలేదుగదా! అని సందేహంతో వణికిపోయిందా క్షణం.

ఎలాగో ధైర్యాన్ని కూడదీసుకొని గదిలోనికి నడిచింది.

ముఖం త్రిప్పుకొని గదిలో పచార్లుచేస్తున్న మనిషిని చూస్తూ కాస్త కలవరపడి వెనకకు అడుగువేసింది.

చప్పుడుకాగానే టక్కున వెనక్కి తిరిగి చూశాడు అతను.

రవీ; అంటూ హృదయానికి హత్తుకొనిపోయింది సంధ్య.

సంధ్యా! నన్ను క్షమించవూ అంటూ అక్కున చేర్చుకొన్నాడు రవి.



కావలెను

మాచే తయారుచేయబడు సిల్కు మరియు కాటన్ హాల్ జమకాణాలు, బెడ్‌షీట్లు అతి ప్రసిద్ధి చెందినది. కళ్యాణమంటపానికి కావలసిన పెద్ద పెద్ద జంకాణాలు తయారించి సకాలంలో అందించగలము.

ఆర్డరు బుక్ చేయుటకు ఏజెంట్లు కావలెను.

M. K. Rajarathnam & Sons
(Carpet Manufacturers)
BHAVANI - 638 302




అశాంతి అంత అలమటిస్తున్న ఆ హృదయాలు అదొక వేడుక! ఆ ఇరువురిమనసులమధ్య కొన్ని నిముషాలు నిశ్శబ్దమే రాజ్యమేలింది!

సంధ్యా! అస్పష్టంగా గొణిగాడు రవి.

ఊఁ....అంది తన్మయత్వంనుండి తేరుకొన్న సంధ్య.

ఏ ఆశయంతో నేను ఇల్లువదలిపోయానో ఆ ఆశయాన్ని నెరవేర్చలేకపోయాను సంధ్యా! నేను దుర్బలున్ని సంధ్యా! నన్ను క్షమించు!

ఛా! ఏమిటామాటలు! వద్దు రవీ! నన్ను విడిచి నీ వెక్కడికీ వెళ్ళకు. కావాలంటే నీకూడ నేనూ వస్తాను. నేను ఒంటరిగా జీవించలేను. నీకష్టసుఖాల్లో నేనూ భాగస్వామినేకదూ రవీ; అంది అతనికౌగిలిలో ఇమిడిపోయి.

నిజం సంధ్యా! ఈ రెండురోజులవియోగాన్ని భరించలేకపోయానంటే నమ్మగలవా? సంధ్యా! తిరిగి తిరిగి విసిగిపోయాను. ఫలితం ఏమాత్రం లేదు. చివరకు ఏది ఏమైనా నిన్ను చేరుకోవాలని కష్టమైనా సుఖమైనా నీతో కలిసే అనుభవించాలని వచ్చేశానంటే నన్ను నమ్మగలవా?

నమ్ముతానంటే మిమ్మల్ని నమ్మక ఇంకెవరిని నమ్మమంటారు చెప్పండి అంది ప్రేమగా తనవ్రేళ్ళలో రవి క్రాపును సవరిస్తూ.

'గుడ్‌న్యూస్' ఏది ఏమైనా రేపే మనపెళ్ళి రిజిష్ట్రార్ ఆఫీసులో అంటూ సంధ్య బుగ్గపై చిటికవేశాడు రవి!

సంతోషంతో ఆబుగ్గలో మొగ్గలే విరిశాయి.

* * *

ఉదయమే తను ఇంటిముందు కారాగడంచూసి ఆశ్చర్యపోయింది సంధ్య. చూడండి ఎవరో వచ్చారు అంది, రవిని పిలిచి!

బయటికిపోయి వచ్చినరవి, పద సంధ్యా; పదిగంటలకు మంచి ముహూర్తముందట అంటూ హడావుడిగా వచ్చాడు.

అబ్బ! ఏమిటండీ, అంతతొందర అంది చిలిపిగా.

ఏమిటి? తొందరగా నిన్ను నాదాన్ని చేసుకోవాలన్న తపన అంటూ చిన్నపిల్లాడిలా చేతులతో పైకెత్తేశాడు.

'అబ్బ! వదలండీ. ఎవరైనాచూస్తే ఏమనుకొంటారో!' అంది కోపాన్ని అభినయిస్తూ!

ఇంకేమనుకుంటారు. ఒకగంటలో ఎలాగూ భార్యాభర్తలం కాబోతున్నాంగా, అంటూ హుషారుగా ఈల వేశాడు రవి.

ఏమిటీ ఈవేళ మీరు మరీ చిత్రంగా ప్రవర్తిస్తున్నారు. కట్టుకొన్న పట్టుచీరెను కడసారిగా సరిచేసుకొంటూ అంది సంధ్య.

ఇదేమిటండి, ఇంకా కారు ఇక్కడే వుందే! అంది అక్కడే ఆగివున్న కారును ఆశ్చర్యంగా చూస్తూ.

అది మనకోసమే డియర్ మా(ఫ్రెండ్ పంపించాడు, త్వరగాపద అంటూ డోరుతెరిచి సీటులో కూర్చోమన్నాడు.

సంధ్యకు అంతా అయోమయంగా వుంది.

కారు ఎక్కడికో తెలియనిప్రదేశాలకు తీసుకుపోతున్న ట్లనిపించింది,

ఎన్నిగంటలు గడిచినా రిజిష్ట్రారు ఆఫీసు రాకపోవడం సంధ్యకు ఆశ్చర్యంతోపాటు గాబరా అధికమైంది.

అదేమిటండీ! ఇది మా ఊరివైపుకు వెళ్ళుతుందేమిటి, కొంపదీసి మాఇంటికే కాదుగదా! అంది తన పరిచయమైన ప్రదేశాన కారు నిలపడాన్నిచూస్తూ. అదేమీలేదు. నేరుగా రిజిష్ట్రారు ఆఫీసుకే వెడుతుంది. కానీ, కంగారుపడకు అంటూ ఏమి తెలియనివాడిలా ప్రశాంతంగా సమాధాన మిచ్చాడు రవి.

అనుకున్నంతపనీ జరిగింది. కారు నేరుగావెళ్ళి తన ఇంటిముందే ఆగింది. తుపాకిగుండు శరీరంలోనికి చొచ్చు కొనిపోయిన లేడీలాగా గిలగిల లాడసాగింది సంధ్య మనసు. ఒకపక్క రవిపై పట్టలేని ఉక్రోషం, కోపం ఒక్కుమ్మడిగా వచ్చాయి.

రవి తనను తల్లి దండ్రులకు అప్పగించడానికి సన్నిన కుట్రగా భావించుకొని మరీ బుసకొట్టింది!

'అమ్మా, సంధ్యా! కారులోనే కూర్చున్నా వెందుకు?' అంటూ ఎదురుగా నిలిచి ఆహ్వానిస్తున్న తల్లి దండ్రులను చూసి ఉలిక్కిపడి వాస్తవానికొచ్చి ఇది కలా నిజమా అని సందిగ్ధంలో పడింది.

సిగ్గు, భయం మితంకాగా ఆనందం మరింత తోడు కాగా తల్లి దండ్రులపాదాలకు నమస్కరించింది సంధ్య!

పెళ్ళి పందిరితో కళకళలాడుతున్న తన ఇంటినిచూసి, అవాక్కయి నిలిచింది.

రావలసిన అతిథులంతా అప్పటికే వచ్చేశారేమొ, ఇల్లంతా ఒకటే సందడి. పదమ్మా త్వరగా....అంటూ ఆడవారు తనను లాక్కుపోయారు.

పురోహితుల మంత్రాలతో మంగళవాయిద్యాలతో బంధుమిత్రుల సమక్షంలో రవి సంధ్యలపెళ్ళి వైభవంగా జరిగింది.

వధూవరు లిద్దరూ పెద్దలందరిదీవెనలు అందుకొన్నారు.

సంధ్యా! నీభర్త చాలా ఘటికుడమ్మా! పెళ్ళికిముందే పరీక్షలుపెట్టి నీప్రేమను పరీక్షించాడు. కానీ నీవే పాసయ్యావు అంటూ దగ్గరికి తీసుకొని ప్రేమతో ఆశీర్వదించాడు తండ్రిగారు.

పిచ్చితల్లీ! నీసుఖంకంటే మాకేంకావాలి చెప్పు! మీ రెక్కడికీ వెళ్ళవద్దు. మాతోనేవుండి ఈఇంటి బారాన్నంత మీరే వహించండి అంటూ ఆనందాశ్రువులు నిండినకళ్ళతో తల్లి దండ్రులిద్దరూ ఆశీర్వదించారు.

అమ్మా! నన్ను క్షమించమ్మా! మిమ్మల్ని ఇంతగా బాధపెడతానని అనాకోలేదు అంటూ, చిన్నపిల్లలా తల్లిని కౌగిలించుకొని బావురుమంది సంధ్య!

తొలిరేయి ...ఇరువురి మనసులు, మమతలు సమంగా పంచుకొని జీవితాంతం అనుభూతులతో తియ్యటి అనుభవాలతో గడపాలని ఏర్పరచిన అనుబంధప్రతిరూపమే తొలి రేయి. ఊహలతో తేలిపోతున్న రవి సంధ్య లోనికి రావడం గుర్తించలేదు!

సిగ్గుతో దరిచేరలేక మొగ్గలా ముడుచుకొన్న ఆ ముద్ద బంతి సౌందర్యాన్ని తిలకిస్తూ కొంచెంసేపు రెప్ప వాల్చకుండా గడిపాడు.

ఆ చూపులదాడికి తాళలేని సంధ్య తన చూపులు మరో వైపుకు మరల్చుకొని కాలివ్రేళ్ళతో నేలకురాస్తూ ఆ కదలికతో ధ్వనించే కాలిమువ్వలసంగీతం మరింత మధురంగా వుంది రవికి!

సంధ్యా! అన్నాడు దరికిచేరి చేతులతో చుట్టేస్తూ.

ఆకళ్ళలోంచి ఎర్రజీరలుచూసి కొంచెం తటపటాయించాడు! కాని మరుక్షణమే ఆ పెదవులపై తెలిసిన దరహాసంతో తృప్తిపడ్డాడు.

సంధ్యా! నిజం చెపుతున్నాను, ఇదొక చిన్న తమాషా మాత్రమే! నేను ఆరోజు ఉత్తరం రాసిపెట్టి నేరుగా మీ నాన్నను కలిశాను. బాధతో చిక్కి శల్యమైన మీ తండ్రి గారినిచూడగానే నేనెంతో విచారించాను. వారిమాట కాదని నువ్వు వెళ్ళినందుకు మానసికంగా శారీరకంగా వారెంతో కుంగిపోతున్నారో ప్రత్యక్షంగా చూడగలిగాను. ఎలాగైనా తిరిగి నిన్ను ఇంటికి రప్పించాలని, నీ ఇష్టప్రకారమే పెళ్ళి జరిపించాలని మీతల్లిదండ్రులు తమ నిర్ణయాన్ని నాతో విన్నవించారు. అందుకు వారితో రెండురోజులు గడువు తీసుకొని నీకొరకై వచ్చాను. ఆతర్వాత జరిగింది తెలుసుగా. ఇది నాతప్పైతే క్షమించవూ, 'డోంట్ వర్రీ డార్లింగ్ ప్లీస్ ఎక్స్క్యూజ్ మి' అంటూ తనవైపుకు తిప్పుకొన్నాడు!

సున్నితమైన తనవ్రేళ్ళతో రవినోటికి తాళం వేసింది సంధ్య!